సాక్షి
పెద్దపల్లి
గురువారం । 23 । నవంబర్ । 2023



మల్లన్నకు మొక్కులు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



అయ్యప్ప ఆలయం ముస్తాబు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయాన్ని వార్షిక మహోత్సవానికి ముస్తాబు చేశారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు.

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హోంమంత్రి వాహనం తనిఖీ



హోంమంత్రి వాహనం ఆపిన పోలీసులు

పాలకుర్తి(రామగుండం): కన్నాల టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్‌ వద్ద రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌ ఆలీ వాహనాన్ని పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండం బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్‌కు మద్దతుగా గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొనేందుకు మహమూద్‌ ఆలీ వెళ్తున్నారు. మార్గమధ్యంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల మెజిస్ట్రేట్‌ మహేందర్‌ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్‌, సివిల్‌ పోలీసులు హోంమంత్రి వాహనం ఆపి తనిఖీ చేశారు. ఈసందర్భంగా హోంమంత్రి వారికి పూర్తిస్థాయిలో సహకరించారు. తొలుత హోంమంత్రి పెద్దపల్లిలో దాసరికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు.

విద్యుత్‌ ఉత్పత్తి పెరగాలని..



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రామగుండం: స్థానిక బీ థర్మల్‌ విద్యుత్‌ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం ముస్లిం ఉద్యోగులు గ్యార్మీషరీఫ్‌ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యుత్‌ ఉత్పత్తిలో బీ థర్మల్‌ ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. విద్యుత్‌ ఉత్పత్తి మెరుగు పడాలని, ప్రాజెక్టు ఉత్పత్తి, ఉత్పాదక సామర్థ్యం పెరగాలని ఆకాంక్షిస్తూ ఉద్యోగులు ఏటా గ్యార్మీ షరీఫ్‌ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ పి.విజేందర్‌, ఇంజినీర్లు శ్రీనివాస్‌రావు, శంకరయ్య, బాలకృష్ణన్‌, సత్యశ్రీనివాస్‌, శశికాంత్‌సింగ్‌, బాషా, రహీంఖాన్‌, అంబరీశ్‌, కార్మిక సంఘాల ప్రతినిధులు అబ్దుల్‌ తఖీ, నజ్మీ, కుమారస్వామి, యాదగిరి, నర్సింహులు, సలీం, జహంగీర్‌ అహ్మద్‌, యూనుస్‌, ఆరీఫ్‌, అయూబ్‌ఖాన్‌ ఉన్నారు.

మద్యంపై డేగకళ్లు

సాక్షి ఫోకస్

- జిల్లాలో రూ.2.93కోట్ల మద్యం సీజ్‌
- ఓటర్లను ప్రభావితం చేయకుండా ఉన్నతాధికారుల చర్యలు



ఎక్సైజ్‌ పోలీసులు పట్టుకున్న అక్రమ మద్యం(ఫైల్‌)

గోదావరిఖని: ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడగానే జిల్లా ఎక్సైజ్‌ శాఖ అప్రమత్తమైంది. మద్యం అక్రమ రవాణా, విక్రయాలు, గంజాయి తరలింపు, గుడుంబా తయారీ, తరలింపు, విక్రయాలపై నిఘా తీవ్రతరం చేసింది. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలకు పూనుకుంటోంది. ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, గుడుంబాను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. జిల్లా ఎక్సైజ్‌ శాఖ, పోలీసులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

జిల్లా కేంద్రంలో అత్యధికం..

- ఇప్పటివరకు జిల్లాకేంద్రంలో అత్యధిక అనుమతిలేని మద్యం పట్టుబడింది.
- గతనెల 9వ తేదీ నుంచి ఇప్పటివరకు పెద్దపల్లి నియోజకవర్గంలో 36,536 లీటర్ల మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.
- దానివిలువ సుమారు రూ.1.21కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.
- ఆ తర్వాత అత్యధికంగా మంథని ప్రాంతంలో 32,381లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- దాని విలువ సుమారు రూ.1.17కోట్లు ఉంటుందని వారు పేర్కొన్నారు.
- ఇక రామగుండం నియోజకవర్గంలో మద్యంతోపాటు రూ.50వేల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- అలాగే రూ.9.32లక్షల విలువైన వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

గుడుంబా, గంజాయిపై దృష్టి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్‌ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గుడుండా, అక్రమ మద్యం, గంజాయి రవాణాపై దృష్టి సారించారు. ఈక్రమంలో ప్రతీచెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్‌ శాఖ సిబ్బంది నిఘా కొనసాగుతోంది. అలాగే ఈప్రాంతంలో గుడుంబా, గంజాయి విక్రయాలు కూడా ఎక్కువగా ఉండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈక్రమంలో జిల్లాలో భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.50వేల విలువైన గంజాయి పట్టుకున్నారు. నిందితులను తహసీల్దార్‌ ఎదుట హాజరుపర్చి రూ.లక్ష పూచీకత్తుపై వదిలిపెడుతున్నారు. మళ్లీ అదే తప్పు చేసి పట్టుబడితే బైండోవర్‌ చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇప్పటిదాకా స్వాధీనం చేసుకున్న మద్యం

నియోజకవర్గం	స్వాధీనం చేసుకున్న మద్యం(లీటర్లలో)	పట్టుకున్న మద్యం విలువ(రూ.కోట్లలో)
రామగుండం	14,798	0.44
పెద్దపల్లి	36,536	1.21
మంథని	32,381	1.17

విక్రయాలపై దృష్టి

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బ్రాందీషాపుల్లో మద్యం అమ్మకాలపై దృష్టి సారించాం. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ప్రతీరోజు క్లోజింగ్‌ స్టాక్‌ రిజిస్టర్‌ చెక్‌ చేస్తున్నాం. అలాగే ఎస్‌ఎస్‌టీ టీంల పర్యవేక్షణకొనసాగుతోంది. రాజకీయ పార్టీలకు మద్యం పెద్దఎత్తున వెళ్లకుండా చర్యలు తీసుకున్నాం. స్టాక్‌ రిజిస్టర్‌ నిర్వహణ, బిల్లు పుస్తకాలు వినియోగించని షాపుల యాజమానులపై కేసులు నమోదు చేశాం. అక్రమ మద్యాన్ని పూర్తిగా నివారిస్తాం.

– ఆర్‌.మహిపాల్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

గంజాయి విక్రేత అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌

జ్యోతినగర్‌(రామగుండం): రామగుండంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌, ఎస్సై వెంకటస్వామిలు బుధవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా అతిపూర్‌ గ్రామానికి చెందిన గోబిందతరై(21) గంజాయికి బానిసయ్యాడు. తక్కువ సమయంలో అధిక మొత్తంలో సంపాదించాలని గంజాయి రవాణా, విక్రయాలపై దృష్టి సారించాడు. ఈక్రమంలో కొంత గంజాయి తీసుకుని రైలులో రామగుండం రైల్వేస్టేషన్‌ చేరుకున్నాడు. రామగుండం ఎస్సై వెంకటస్వామి, కానిస్టేబుల్‌ అనిల్‌ కుమార్‌, పోలీసు సిబ్బంది మంగళవారం ఎన్నికల విధుల్లో భాగంగా పెట్రోలింగ్‌ చేపట్టారు. ఈక్రమంలో రామగుండం రైల్వేస్టేషన్‌ సమీపంలో గోబిందతరై అనుమానాస్పదంగా కనిపించాడు. ఆ వెంటనే పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు అప్రమత్తమై వెంబడించి పట్టుకున్నారు. అతడి బ్యాగు తనిఖీ చేయగా గంజాయి లభించింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని రామగుండం తహసీల్దార్‌ ద్వారా పంచనామా చేశారు. సుమారు రూ.2.50లక్షల విలువైన పది కిలోల గంజాయి లభ్యమైనట్లు పోలీసులు వివరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్సై వెంకటస్వామి, కానిస్టేబుల్‌ అనిల్‌కుమార్‌ను సీఐ చంద్రశేఖర్‌ గౌడ్‌ అభినందించి రివార్డు అందించారు. తమ పిల్లలు వ్యసనాల బారినపడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్‌



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌, అధికారులు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈనెల 30న పోలింగ్‌ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్‌ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌ నితిశ్‌వ్యాస్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్‌ పత్రాల ముద్రణ, ఈవీఎంల పనితీరు, డిస్ట్రిబ్యూషన్‌, ఇంటినుంచి ఓటు సేకరణ, పోలింగ్‌ సిబ్బందికి శిక్షణ, తదితర అంశాలపై పలు సూచనలిచ్చారు. జిల్లాలో 7.11 లక్షల మంది ఓటర్లు ఉంటే.. ఇప్పటివరకు 5.73లక్షల మంది ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్పులు అందించామని తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు అందరికీ అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండేసి ఈవీఎంలను వినియోగిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్‌ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఇప్పటివరకు 21 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్‌ వివరించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌ ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి అన్నారు. పోలీసు కమిషనరేట్‌ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసేలా ప్రజలను ప్రలోభాలకు గురిచేసే మద్యం, డబ్బు, వస్తువుల అక్రమ రవాణాకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా అనుమానితులు డబ్బు తరలించే అవకాశం ఉండటంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, లాడ్జీలు, వాహనాలు తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి రవాణా చేస్తే మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ అమలు చేస్తామని హెచ్చరించారు.

ఓటు గోప్యతకు పటిష్ట చర్యలు

- రామగుండం ఎన్నికల అధికారి అరుణశ్రీ
- ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియ పరిశీలన



ఓటు వేసే ప్రక్రియ పరిశీలిస్తున్న అరుణశ్రీ

జ్యోతినగర్‌(రామగుండం): కార్పొరేషన్‌లోని నర్రాశాలపల్లె, మల్కాపూర్‌ తదితర ప్రాంతాల్లో చేపట్టిన ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారి అరుణశ్రీ బుధవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు దివ్యాంగులు, 80ఏళ్ల వయసు పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. నియోజకవర్గంలో 331మంది ఈ పద్ధతి ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారికోసం నియోజకవర్గాన్ని 24 రూట్లు విభజించి, 24 ఎన్నికల బృందాలను నియమించారు. ఓటర్లు ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునేలా ఆ బృందాల్లోని అధికారులు చూస్తున్నారు. ఉదయం 7 గంటలకు ఈప్రక్రియ ప్రారంభిస్తున్నారు. ఓటుహక్కు వినియోగించుకునే సమయంలో ఓటరు గోప్యత పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి అరుణశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌



కొనుగోళ్లు తనిఖీ చేస్తున్న శ్యాంప్రసాద్‌లాల్‌

కమాన్‌పూర్‌(మంథని): సిద్దిపల్లె పీఏసీఎస్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌ లాల్‌ బుధవారం తనిఖీ చేశారు. కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. తేమశాతం వచ్చి ధాన్యం వెంటనే తూకం వేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట సివిల్‌ సప్లయి డీఎం శ్రీకాంత్‌ రెడ్డి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్‌, పీఏసీఎస్‌ సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్‌ ఉన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

రామగిరి(మంథని): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌ అధికారులను ఆదేశించారు. కల్వచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని, హమాలీల కొరత లేకుండా జాగ్రత్త వహించాలని, పరిమితికి మించి లారీల్లో ధాన్యం రవాణా చేయవద్దని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్రక్‌షీట్‌ జనరేట్‌ చేయాలని, రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో ధాన్యం డబ్బులు జమయ్యేలా చూడాలని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం నష్టపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సివిల్‌ సప్లయి జిల్లా మేనేజర్‌ శ్రీకాంత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి బూక్య మోహన్‌ పాల్గొన్నారు.

ఈటల వర్గం.. ఆగమాగం!



- రెండుచోట్లా గెలిస్తే హుజూరాబాద్‌కు రాజేందర్‌ రాజీనామా?
- ఆ తర్వాత తమ భవితవ్యమేంటని లీడర్ల ఆందోళన
- తుల ఉమ తరహాలో పట్టించుకోరేమోనని సందేహం
- ఇప్పటికే ఎంపీ సంజయ్‌, గంగాడి వర్గాలతో పెరిగిన దూరం

జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్‌: మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ వర్గాన్ని ఓ ఆందోళన వెంటాడుతోంది. ఇటు హుజూరాబాద్‌, అటు గజ్వేల్‌లో పోటీ చేస్తున్న ఆయన రెండుచోట్లా గెలిస్తే.. హుజూరాబాద్‌కు రాజీనామా తప్పదన్న ప్రచారమే ఇందుకు కారణం. వాస్తవానికి ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగిన బీసీ నాయకుడు ఈటల రాజేందర్‌. తన అనుచరుల్లో ఈ రకపు ఆందోళనలు పెరిగేందుకు ఆయన వ్యవహారశైలి, రాజకీయ ఒడిదుడుకులే కారణమవుతున్నాయి.

గెలిస్తే 6 నెలల్లో రాజీనామా

ఈటల రాజేందర్‌ హుజూరాబాద్‌ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నేత. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నాయకుడు కావడం విశేషం. శాసనసభా పక్ష నేతగా, మంత్రిగా తన నియోజకవర్గాన్ని బాగానే అభివృద్ధి చేసుకున్నారు. హుజూరాబాద్‌, జమ్మికుంట మున్సిపాలిటీల ఏర్పాటు, హుజూరాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితరాలతో ఆయన స్థానికుల మనసు గెలుచుకున్నారు. 2021లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ వీడి, బీజేపీ నుంచి ఉపఎన్నికలో విజయం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన తన స్థానంతోపాటు సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనూ పోటీ చేస్తున్నారు. రెండు చోట్లా గెలిస్తే 6 నెలల్లో ఏదో ఒక స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం. సీఎంపై గెలిచాక ఆ రికార్డును కాపాడుకునేందుకు అక్కడే ఉంటారు కానీ, అక్కడ రాజీనామా చేసి, హుజూరాబాద్‌కు ఎందుకు వస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది. అలాంటప్పుడు రాజేందర్‌ను గెలిపిస్తే.. తమ భవితవ్యం ఏంటన్న ఆలోచన ఆయన కేడర్‌లో నిరుత్సాహం నింపుతోంది.

ఈటల రాజేందర్‌ మనుషులను వాడుకొని వదిలేస్తారన్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు ముమ్మరం చేశాయి. గతంలో సీఎం కేసీఆర్‌ సాయంతో తిరుగులేని నేతగా ఎదిగి న ఆయన, ఆ తర్వాత బీజేపీలో ఎంపీ బండి సంజ య్‌ సాయంతో గెలిచాడంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలతో కేసీ ఆర్‌కు, హుజూరాబాద్‌ ఉప ఎన్నిక తర్వాత బండి సంజయ్‌కు వెన్నుపోటు పొడిచారని చెబుతున్నాయి. తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంపీ సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి ఈటల రాజేందరే కారణమని పేర్కొంటున్నాయి. ఆయనను నమ్ముకొని, బీజేపీలోకి వచ్చిన తుల ఉమకు పార్టీ టికెట్‌ ఇప్పించడంలోనూ విఫలమయ్యారని ఆమె అనుచరులు అంటున్నారు. ఆయన కేసీఆర్‌, సంజయ్‌ని వాడుకున్నట్లే.. తమనూ వాడుకొని, వదిలేశారని మండిపడుతున్నారు.

కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌తో గట్టి పోటీ..

గతంలో ఈటల రాజేందర్‌ హుజూరాబాద్‌లో ఏ ఒక్కరినీ బీఆర్‌ఎస్‌ నుంచి ఎదగనీయలేదని, అందుకే ఇంతకాలం గెలుస్తూ వచ్చాడని పలువురు అంటున్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌ రెడ్డి 2018లో ఆయనకు చెమటలు పట్టించారు. ప్రస్తుతం పాడితోపాటు కెప్టెన్‌ లక్ష్మీకాంతరావు అన్న మనవడు వొడితెల ప్రణవ్‌(కాంగ్రెస్‌) కూడా బరిలో ఉన్నారు. ఈ ఇద్దరూ అంగబలం, అర్థబలం దండిగా ఉన్న నేతలు. వీరిని ఢీకొట్టాలంటే వాస్తవానికి ఎంపీ బండి సంజయ్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిల సాయం తప్పనిసరి. కానీ, వీరిద్దరితో ఈటలకు పొసగడం లేదన్న ఆరోపణలున్నాయి. వారు ఎక్కడా ఆయన ప్రచారంలో కనిపించకపోవడం గమనార్హం.

రాజ్‌నాథ్‌ ఎదుట కాంగ్రెస్‌పై ప్రశంసలా?



ఇటీవల జమ్మికుంటలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌తో నిర్వహించిన సభలోనూ ఎంపీ సంజయ్‌ పాల్గొనలేదు. ఎక్కడా ఆయన ప్రస్తావన లేకపోయేసరికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అదే వేదికపై ఈటల రాజేందర్‌ కాంగ్రెస్‌ నేతలపై ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, కాంగ్రెస్‌ జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు యాదవ్‌, ఆయన సోదరులు తన గెలుపు కోసం పని చేశారని కీర్తించారు. ఈ మాటలకు వేదిక కింద ఉన్న బీజేపీ నాయకులు అవాక్కయ్యారు. తన కోసం ప్రచారం చేసిన ఎంపీ సంజయ్‌ పేరు ఎందుకు ఉచ్చరించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌ పార్టీ తన గెలుపు కోసం పని చేసిందని చెప్పి, బీజేపీ విజయాన్ని పలుచన చేశారని మండిపడుతున్నారు. ఏ వేదిక ఎక్కినా.. వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తున్నారు తప్ప.. బీజేపీ సిద్ధాంతాలను, దేశభక్తి, ప్రధాని మోదీ, భారత్‌ మాతా, అద్వానీ, వాజ్‌పేయి అన్న పదాలు పలికేందుకు ఆయనకు మనసు రావడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలో తన కీలక అనుచరులుగా పేరొందిన వారంతా కాంగ్రెస్‌లో చేరడం చర్చకు దారితీసింది.

ఐఈఎస్‌లో 31వ ర్యాంక్‌




రావికంటి వంశీకృష్ణ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌ 39వ డివిజన్‌ శాంతినగర్‌కు చెందిన రావికంటి వంశీకృష్ణ ఐఈఎస్‌(ఇండియన్‌ ఇంజినీరింగ్‌ సర్వీస్‌) ఆల్‌ ఇండియాస్థాయిలో 31వ ర్యాంక్‌ సాధించాడు. వంశీకృష్ణ ఎఫ్‌సీఐలోని డీఏవీ, ఎన్టీపీసీలోని చిన్మయ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు ఏపీలోని గుడివాడ, విజయవాడలో ఇంటర్మీడియెట్‌, హైదరాబాద్‌లో బీటెక్‌ అభ్యసించాడు 2019 సంవత్సరంలో టీఎస్‌ ఎస్పీడీసీఎల్‌లో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంక్‌ సాధించాడు. హైదరాబాద్‌ ఆబిడ్స్‌లో టీఎస్‌ ఎస్పీడీఎల్‌ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా లాంగ్‌ లీవ్‌ పెట్టి.. ఇంటి వద్ద ఐఈఎస్‌కు ప్రిపేర్‌ అయ్యాడు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- ఎమ్మెల్యే అసమర్థతతోనే పెద్దపల్లి పదేళ్ల వెనక్కి
- కాంగ్రెస్‌ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు





సాక్షి, పెద్దపల్లి: 'బీఆర్‌ఎస్‌ హామీల అమలులో విఫలమైంది. రాష్ట్రం, నియోజకవర్గంలో కుటుంబ పాలన కొనసాగిస్తోంది. దందాలతో వా రి కుటుంబాలే బాగుపడ్డా యి. జిల్లాలో ఖర్చుపెట్టాల్సిన నిధులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా స్థాని క ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదు. దీంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు' అని పెద్దపల్లి కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణరావుతో తెలిపారు. 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి : ప్రచారం ఎలా సాగుతోంది?

విజయరమణారావు : ప్రజాదరణ బాగాఉంది. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉంటున్నా. 10నెలల ముందు నుంచే 'ఇంటింటికీ విజ్జన్న'పేరిట నియోజకవర్గం చుట్టివచ్చా. ప్రతీగడపను మూడుసార్లు తాకిన. ప్రజా సమస్యలు, బాధలను చూడటమే కాకుండా అధికారంలోకి వచ్చాక పరిష్కార దిశగా అధ్యయనం చేశా. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒకసారి అధికారం ఇస్తే తప్పేంటని ప్రజలు కాంగ్రెస్‌ వైపు చూస్తున్నారు.

సాక్షి: మీరెలా విజయం సాధిస్తారు?

విజయరమణారావు : అర్హులైన ఒక్కరికీ డబుల్‌ బెడ్రూం ఇల్లు రాలేదు. దళితబంధు, బీసీబంధు కమీషన్‌ తీసుకోని ఇచ్చిండు. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదు. ఇలా బీఆర్‌ఎస్‌ ఏ హామీ నెరవేర్చలేదు. భూమాఫియా, ఇసుక, మట్టి దందాలతో దోచుకున్నాడు. ప్రభుత్వం, దాసరిపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అది నన్ను గెలిపించబోతోంది.

సాక్షి: మేనిఫెస్టోను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారు?

విజయరమణారావు : కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీలు ప్రజల్లోకి చొచ్చుకపోయాయి.

సాక్షి: బీఆర్‌ఎస్‌ విమర్శలు తిప్పుకొడుతున్నారా?

విజయరమణారావు : కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు హామీగా ఇచ్చాం. అక్కడ పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాం. స్థానిక ఎమ్మెల్యే తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి బట్టకాల్చి ఇతరులపై అబద్ధపు ఆరోపణలు చేస్తుండు. ఎమ్మెల్యే కుటుంబం అవినీతిని ప్రజాక్షేత్రంలో నిలదీస్తుండటంతోనే పసలేని ఆరోపణలు చేస్తున్నరు.

సాక్షి: ప్రజలు మీకు ఎందుకు ఓటేయాలి?

విజయరమణారావు : జిల్లాకేంద్రలో చేయాల్సిన అభివృద్ధి చేయలేదు. ఎమ్మెల్యే అసమర్థతతో మెడికల్‌ కాలేజీ, పోలీస్‌ కమిషనరేట్‌ రామగుండం తరలిపోయాయి. భూముల ధరలు పెంచుకునేందుకు కోర్టు, కలెక్టరేట్‌ను శివారు ప్రాంతాలకు తరలించారు. డీఎంఎఫ్‌టీ నిధులను సిరిసిల్ల, గజ్వేల్‌, సిద్దిపేటకు తరలిపోతుంటే పట్టించుకోలేదు. తన ఆస్తులు పెంచుకోవడానికే పనిచేయటంతో పెద్దపల్లి పదేళ్ల వెనక్కి పోయింది. ఇదే విషయాన్ని ప్రజల ముందు ఉంచి ఓట్లు అడుగుతున్న.

సాక్షి: మీరు గెలిచాక చేసే అభివృద్ధి పనులేమిటి?

విజయరమణారావు : జిల్లా కేంద్రంలోని రాజీవ్‌రహదారిపై తరచూ జరిగే ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటా. కొలనూర్‌, గర్రెపల్లితోపాటు పెద్దపల్లిని రూరల్‌, అర్బన్‌ మండలాలుగా ఏర్పాటు చేస్తాం. పెద్దపల్లి మున్సిపాలిటీ ట్రేడ్‌ లైసెన్సుల ఫీజు తగ్గిస్తాం. పెద్దపల్లిలో బస్టాండ్‌, ఎలిగేడులో పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటు చేస్తాం.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



డిమాండ్ పత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మిక సమస్యలు పరిష్కరించే వారికే కార్మికుల మద్దతు ఉంటుందని సీఐటీయూ ఆర్జీ–1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వర్క్ షాప్‌లో కార్మికులను కలిసి డిమాండ్‌లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, కార్మికుల ఆదాయ పన్ను మినహాయించాలని, మారుపేర్ల మార్పు, డిపెండెంట్ కార్మికుల వయస్సు పెంచాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించేవారికి తమ ఓటేస్తామని స్పష్టం చేశారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా సతీశ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడిగా మేరుగు సతీశ్, ప్రధాన కార్యదర్శిగా మందల శ్రీకాంత్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఆర్థిక కార్యదర్శిగా మాధవాచారి, కౌన్సిలర్‌గా సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవీంద్రాచారి తెలిపారు.

యువకుడి అదృశ్యం

కరీంనగర్ క్రైం: నగరానికి చెందిన ఒక యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన గడిపే శ్రవణ్‌కుమార్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. 15 రోజుల కింద కరీంనగర్ వచ్చి, వివాహం చేసుకుంటానని తల్లికి చెప్పాడు. జీవితంలో స్థిరపడిన తర్వాత చేస్తామని ఆమె సర్ది చెప్పడంతో ఒకే అన్నాడు. ఈ నెల 17న ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

హోంగార్డుకు ఆత్మీయ సన్మానం

సిరిసిల్లక్రైం: సుదీర్ఘకాలం పోలీస్‌శాఖలో పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బి.వెంకటేశంకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆత్మీయ సన్మానం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన వెంకటేశం దంపతులను శాలువాతో సత్కరించి వెల్ఫేర్ ఫండ్ నుంచి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10 వేల చెక్కును అందించారు. 33 ఏళ్ల పాటు పనిచేసిన తీరును మరువలేమని, కుటుంబ అవసరాలకు తమ సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆర్ఐలు రమేశ్, మధుకర్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డు దేవరాజు పాల్గొన్నారు.

వ్యభిచారం చేయిస్తున్న వ్యక్తిపై కేసు

వేములవాడ: ఇతర రాష్ట్రానికి చెందిన యువతితో వ్యభిచారం చేయిస్తున్న కంసాని శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో ఇతర రాష్ట్రానికి చెందిన యువతికి పని ఇస్తానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లి బంధించి వ్యభిచారం చేయించారని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓటు గోప్యత పాటించేలా పటిష్ట చర్యలు



ఇంటి నుంచి ఓటు సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



కొడుకు సహాయంతో ఓటు హక్కు వినియోగించుకున్న లక్ష్మీనర్సవ్వ

రామగిరి: ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఓటరు గోప్యత పాటించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. బుధవారం బుదవారంపేట గ్రామంలో ఇంటి నుంచి ఓటు సేకరించే ప్రక్రియను పరిశీలించారు. బుధవారంపేట గ్రామంలో పోలింగ్ కేంద్రం 284 పరిధిలో ఇంటి నుంచి ఓటు సేకరణ ప్రక్రియను పరిశీలించామని, నిబంధనల ప్రకారం జరుగుతుందన్నారు. ఇంటి నుంచి ఓటు స్వీకరించే షెడ్యూలు వివరాలు పోటీ చేసే అభ్యర్థులకు అందించడం జరిగిందని, వారి ఏజెంట్లు సైతం బృందాలతో ఇంటికి వెళ్లొచ్చని అన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఎన్నికల కమిషన్ ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించుకొనే అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారి కోసం ప్రత్యేక ఎన్నికల బృందాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు సేకరిస్తున్నామని తెలిపారు. ఇంటి వద్ద ఓటు హక్కు స్వీకరించే సమయంలో పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు.

ఇంటి వద్ద ఓటేసిన ఓటర్లు



ఓ ఇంటి వద్ద అధికారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పూసాల, శాస్త్రీనగర్, ఆరేపల్లి, సుల్తానాబాద్‌లోని పలు కాలనీలు, గ్రామాల్లో ఓటర్లు తమ ఇళ్ల వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12–డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. నాయబ్ తహసీల్దార్ మహేశ్, పీవో శ్రీధర్ శ్రీనివాస్, అధికారులు నవీన్, రమేశ్, రెవెన్యూ అధికారులు స్రవంతి, శ్రీవాణి, స్వాతి పాల్గొన్నారు.

ఓటేసిన వందేళ్ల అవ్వ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన వందేళ్ల వృద్ధురాలు సుంక లక్ష్మీనర్సవ్వ బుధవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. లక్ష్మీనర్సవ్వ ఇంటి వద్ద ఓటుకు నమోదు చేసుకోగా, బుధవారం ఇంట్లోని ఆమె మంచం దగ్గరే పోలింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. తన కుమారుడు చైనా సూదుల(అక్యూపంక్చర్) డాక్టర్ సుంక నారాయణ సహకారంతో లక్ష్మీనర్సవ్వ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యువతకు లక్ష్మీనర్సవ్వ ఆదర్శంగా నిలిచారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- యాజమాన్యంతో రాజీ పడే ప్రసక్తే లేదు
- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సంఘాల యునైటెడ్ ఫోరం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలోని కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు జేఏసీ సంఘాలు కృషి చేస్తున్నాయని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు బుధవారం తెలిపారు. 1990 నుంచి నేటివరకు సమస్యల పరిష్కారం, అలవెన్సుల పెంపుపై ఉద్యమిస్తున్నామని గుర్తుచేశారు. గతంలో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయించడం లేదని, ఒక ప్రముఖ నాయకుడితో కలిసి జేఏసీ, యాజమాన్యం, కాంట్రాక్టర్లు చీకటి ఒప్పందం చేసుకున్నారని మావోయిస్టు పార్టీ కార్యదర్శి వెంకటేశ్ పేరిట ఇటీవల లేఖ విడుదల కావడం శోచనీయమన్నారు. ప్రమోషన్ పాలసీ, ఐటీఐ పదోన్నతి పాలసీ, డిపెండెంట్ తదితర విషయాలపై ఎన్టీపీసీ యాజమాన్యం కాలయాపన చేస్తుందన్నారు. యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా అనేకసార్లు ధర్నాలు చేశామని, చివరకు సమ్మె నోటీసు అందజేశామని గుర్తుచేశారు. 2018లోని అంశాలను నెరవేర్చాలని నిరసన చేపడితే.. యాజమాన్యం కుట్రపూరితంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కార్మికులపై లాఠీచార్జి చేయిందని, ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. యాజమాన్యం దిగివచ్చి ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, కార్మిక సంఘం నాయకుడు కౌశిక హరి, కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ సమక్షంలో చర్చించి డిపెండెంట్ ఉద్యోగాల కొనసాగింపు చేపట్టిందన్నారు. మిగతా విషయాలపై కూడా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్టీపీసీ ప్లాంట్‌లో శ్రమిస్తున్న కార్మికుల కోసం యూనియన్ల ద్వారా ఉద్యమిస్తున్నామే తప్ప ఏనాడూ యాజమాన్యంతో రాజీపడలేదని స్పష్టం చేశారు. ప్రలోభాలకు లొంగలేదని నాయకులు పేర్కొన్నారు.

నేడు పెద్దపల్లికి మాయావతి రాక



మాట్లాడుతున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయావతి గురువారం పెద్దపల్లిలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతారని పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే సభ ఏర్పాట్లను బుధవారం ఉష జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, నాయకుడు ఈర్ల కొమురయ్య, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తితో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఎండీ రియాజ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు సన్నాహాలు



శ్రీవాణి జూనియర్ కళాశాలలో పరిశీలిస్తున్న జనార్దన్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్రీడాకారుల క్రీడా హబ్‌గా పేరు పొందిన క్రీడల ఖిల్లా సుల్తానాబాద్ వేదికగా మరోమారు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యానికి దోహదపడే యుద్ధక్రీడయిన జూడో తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడానికి పెద్దపల్లి జూడో సంఘం సన్నాహాలు ప్రారంభించింది. బుధవారం తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్ కళాశాలలో వేదికను పరిశీలించారు. జూడో పోటీలకు సంబంధించిన మైదానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూడో పోటీలకు కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి ఉమ్మడి కరీంనగర్ కీర్తిని చాటుతున్నారని అన్నారు. డిసెంబర్ నెలలో సబ్ జూనియర్ విభాగంలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు, రెఫరీలు హాజరు కానున్నట్లు వివరించారు. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ మాట్లాడుతూ.. క్రీడాపోటీల నిర్వహణకు సుల్తానాబాద్ ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ సంవత్సరంలో జూడో విభాగంలో రాష్ట్ర పోటీలకు ఆతిథ్యమివ్వనున్నట్లు తెలిపారు. పోటీల విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. శ్రీవాణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, రాష్ట్ర బేస్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎండీ యూనిష్ పాష, సుల్తానాబాద్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు బైరగోని రవీందర్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల జూడో కోచ్ బి.సాయి రాంయాదవ్, సీనియర్ ఖోఖో క్రీడాకారుడు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న చంద్రన్న

మంథని: మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు తమపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మావోయిస్టు నేత చంద్రన్న అన్నారు. బుధవారం ఆయన మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ నక్సలైట్లకు లైసెన్సు లేని తుపాకులు, కత్తులు ఇచ్చి దాడులు చేస్తున్నారని మధు మాట్లాడటం దిగజారుడు చర్యకు నిదర్శనమన్నారు. ముత్తారం మండలం ఓడేడ్ సర్పంచ్ బక్కారావుపై మంగళవారం రాత్రి మహాముత్తారం మండలం మీనాజీపేటలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కొన్ని దశాబ్దాలు ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పోరాటం చేసిన తమను పుట్ట మధు అవమానపరిచేలా ప్రకటనలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము కూడా తమవంతు సహకారం అందించామని గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో తామంతా పుట్ట మధు కు అండగా ఉన్నామని, అప్పుడు తమ వద్ద ఆయుధాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో పాల్గొనే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఈ విషయాన్ని మరిచి మాపై కుట్రపూరితమైన ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూసే వారి చర్యలను విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు గ్రహించాలన్నారు. మాజీ నక్సలైట్లు అరెల్లి కొమురయ్య, చంద్రు శ్రీనివాస్, యేసుల పోచం, జంజర్ల శ్రీను, బొమ్మ బాపురెడ్డి, కండె గట్టయ్య, గాడెపు బానేష్, అడప శంకరయ్య, పావిరాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



కళాజాత ఆటాపాట

రామగుండం: ఓటు ప్రాధాన్యం, ఓటుహక్కు వినియోగంపై అంతర్గాం మండలం విసంపేట, ఎగ్లాస్‌పూర్, మద్దిర్యాల, పొట్యాల తదితర గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. కళాకారులు తమ ఆటాపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 30న ఓటర్లు విధిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.6,783

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,783 ధర పలికింది. కనిష్ఠంగా రూ.5,811 పలికింది. సగటు ధర రూ.6,645గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

రూ.42.75లక్షల నగదు సీజ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో చేపట్టిన తనిఖీల్లో రూ. కోటి62లక్షల72వేల360 స్వాధీనం చేసుకోగా, ఆధారాలు చూపించడంతో రూ.కోటి 19లక్షల97వేల360 నగదు విడుదల చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం తెలిపారు. సరైన ఆధారాలు చూపని కారణంగా రూ.42లక్షల 75వేలను సీజ్‌చేసి ఉంచినట్లు పేర్కొన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా 171 ఫిర్యాదులు, 1950 టోల్‌ఫ్రీ ద్వారా 1475 ఫిర్యాదులు అందాయని వివరించారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా శంకర్

జగిత్యాల: ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మచ్చ శంకర్ నియమితులయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా మచ్చ శంకర్ ఎన్నిక కాగా.. ప్రధాన కార్యదర్శిగా బైరం హరికిరణ్, ఆర్థిక కార్యదర్శిగా బండి శ్రీనివాస్, భూమయ్య, శనిగారపు రవి, రవీందర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పర్వత్‌రెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

బీజేపీ కార్యకర్తపై కేసు

కరీంనగర్ క్రైం: అనుమతి లేకుండా బీజేపీ అభ్యర్థి ప్రచార పోస్టర్‌ను బైక్‌కు అతికించుకొని తిరుగుతున్న ఆ పార్టీ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్ఐ స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వరుకోలుకు చెందిన బండారి ప్రశాంత్ హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొమ్మ శ్రీరాం చక్రవర్తికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను తన ద్విచక్రవాహనానికి అంటించాడు. బుధవారం కరీంనగర్ బస్టాండ్ వద్ద ఎన్నికల అధికారులు అతన్ని ఆపారు. ఎలాంటి అనుమతి పత్రం లేకపోవడంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి: రత్నాపూర్ పంచాయతీ రాంనగర్‌కు చెందిన పీట్ల కనకయ్య(47) అనే తాపీమేస్త్రీ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం రాత్రి పురుగుల మందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్సై రవి ప్రసాద్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వ్యక్తికి జైలు

కరీంనగర్ క్రైం: దివ్యాంగురాలైన బాలిక(12)పై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్, పోక్సో కోర్టు జడ్జి శ్రీవాణి తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని పీచుపల్లిలో నివాసం ఉంటున్న దంపతులు కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. పెద్ద కూతురు కాలేజీకి వెళ్తుండగా, పెద్ద కొడుకు, రెండో కూతురు హాస్టల్లో ఉంటున్నారు. చిన్న కొడుకు స్కూల్‌కు వెళ్తుండగా, చిన్న కూతురు పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో ఇంట్లోనే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన నేరచరిత్ర కలిగిన పీచు శేఖర్ రెడ్డి అలియాస్ రమేశ్(35)కు ఆ కుటుంబంతో పరిచ యం ఉంది. దివ్యాంగ బాలికపై అతని కన్నుపడింది. గత ఫిబ్రవరి 6న దంపతులు బ్యాంకు పనిపై వె ళ్లారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించిన శేఖర్ రె డ్డి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు రావడాన్ని గమనించి, అక్కడినుంచి పారిపోయాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కు చిగురుమామిడి పోలీసులు శేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయగా సీఐలు శశిధర్ రెడ్డి, రమేశ్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

ప్రేమజంట ఆత్మహత్య

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో విషాదం



చెల్ల సంధ్య (ఫైల్)



సామల శ్రీధర్ (ఫైల్)

కోనరావుపేట/తంగళ్లపల్లి: పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ప్రేమికులు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో విషాదం నింపింది. జిల్లాలోని కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన సామల లక్ష్మీనారాయణ–ఇందిర దంపతులు కొన్నేళ్లుగా సిరిసిలలోని టెక్స్‌టైల్‌పార్క్‌లో నివసిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు శ్రీధర్(20) ఉన్నాడు. శ్రీధర్ ఐటీఐ సెకండియర్ చదువుతున్నాడు. వీరి ఇంటి పక్కనే ఒబుళాపూర్‌కు చెందిన చెల్ల రాజు–రేణుక దంపతులు కొంతకాలంగా నివసిస్తున్నారు. వీరి కూతురు సంధ్య(17) ఇంటర్ సెకండియర్ చదువుతుంది. సంధ్య, శ్రీధర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ఇద్దరు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చారు. ఇదిలా ఉండగా సంధ్య కనిపించడం లేదని మంగళవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో యువతి బంధువులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం మామిడిపల్లి–కనగర్తి గ్రామాల మధ్య మూలవాగులో ఇద్దరు మృతిచెంది ఉన్న విషయాన్ని గొర్లకాపరుల ద్వారా గ్రామస్తులకు తెలిసింది. వారి పక్కన గడ్డిమందు డబ్బా పడి ఉండడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నారు. వీరి ఫోన్, బ్యాగ్ వేములవాడలోని సాయిరక్ష దాబా సమీపంలో లభించాయి. సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, కోనరావుపేట, తంగళ్లపల్లి ఎస్సైలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు అమ్ముకోవద్దు

జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్



వాల్‌పోస్టర్ ప్రదర్శిస్తున్న నాయకులు

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బుకు ఆశపడితే ఓట్లు అమ్ముకుంటే మరో ఐదేళ్లు మోసపోవడం ఖాయమని జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్‌సెంటర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీలతో సంబంధం లేకుండా అభ్యర్థుల నైతికప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థతను పరిశీలించి ఎన్నుకోవాలని కోరారు. ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని అన్నారు. ఓటు అమ్ముకుంటే బతికున్న శవంతో సమానమని పేర్కొన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ధనప్రలోభాన్ని, ఓట్ల కొనుగోలును ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల బాధ్యతను చాటిచెబుతూ జైభారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్‌ను తెలంగాణ వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతోందని వివరించారు. అనంతరం పట్టణంలో పలుచోట్ల కరపత్రాలు పంచడంతోపాటు పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గోల, సుధాకర్, ఆంజనేయులు, ఖాజమీయా తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీపరులను ఎన్నుకోవాలి

మంథని: నిజాయితీపరులకు ఓటు వేసి గెలిపించాలని జై భారత్ జాతీయ కార్యదర్శి కనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఓటర్ చైతన్య సదస్సు పోస్టల్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు ప్రచారం చేస్తున్నామన్నారు. నిజాయితీపరులను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని కోరారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి బోయ సుధాకర్, జాతీయ సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ప్రతినిధులు మేకల మల్లేశం, మాధడి పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

అంత్యక్రియలయ్యాక.. పోస్టుమార్టం

- మృతురాలి కూతుళ్ల ఫిర్యాదుతో పోలీసుల చర్యలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ పంచాయతీ పరిధి గూడాటిపల్లికి చెందిన భోజ లక్ష్మి(55) రెండు రోజుల క్రితం మృతిచెందగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. కానీ, ఆమె కూతుళ్ల ఫిర్యాదుతో పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మి అనారోగ్యంతో బాధ పడుతుండగా కుటుంబసభ్యులు ఈ నెల 16న వరంగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 19న మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమె మృతదేహానికి అదేరోజు తమ వ్యవసాయ పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, లక్ష్మి మృతి విషయంలో అన్న మహేశ్, వదినపై అనుమానాలున్నాయని మృతురాలి కూతుళ్లు కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ అనుపమ సమక్షంలో లక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం చేయించినట్లు పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

తిమ్మాపూర్(మానకొండూర్): బైండోవర్ ఉల్లంఘించిన మల్లాపూర్‌కు చెందిన పొనగంటి అజయ్‌కి రూ.లక్ష జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు. ఆగస్టు 10న అజయ్‌పై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అదే నెల 11న పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అతన్ని తిమ్మాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అజయ్ గత 31న మళ్లీ నేరం చేశాడు. ఈ మేరకు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. అతన్ని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.లక్ష జరిమానా విధించారు. 6నెలలు అజయ్‌పై నిఘా ఉంటుందని తెలిపారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఆరు నెలల్లోపు ఏదైనా క్రిమినల్ చర్యల్లో పాల్గొన్నా లేక ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహరించినా చట్ట ప్రకారం 6నెలల జైలుశిక్ష అనుభవించాలి లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఏసీపీ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇదులాపూర్ గ్రామానికి చెందిన బందారపు కుమార్(33) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 21న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈక్రమంలో ఇంటి ఎదుట గుడిసెలో ఉరివేసుకుని మృతి చెందాడు. మద్యం మత్తులో తన భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య లావణ్య, తల్లి లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.